

# అడుగుపడితే అపాయం

## - కొమ్మూరి సాంబశివరావు



### (గత సంచిక తరువాయి)

"లేదు అరగంటసేపు రోడ్ అంతా వెదికారు మా కానిస్టేబుల్స్. పోలీస్ కారు అంతా వెతికాము. ఇంకేమీ లేదు."

"అయితే ఫిరోజ్ ఆత్మహత్య చేసుకున్నాడని ఎలా నిశ్చయించుకున్నారు?"

ఇన్‌స్పెక్టర్ కుర్చీ మీద వస్తువులని పరీక్షగా చూసి "ఫిరోజ్ ఆత్మహత్య చేసుకోలేదని రుజువు చేసే వస్తువులు వీటిలో ఏమయినా వున్నాయా?" అడిగాడు.

"ఆత్మహత్య చేసుకుంటున్నానని రాసిన ఉత్తరం బాల్‌పాయింట్ పెన్సిల్‌తో రాసి వుంది. కాని బాల్‌పాయింట్ పెన్సిల్ అతని జేబులో లేదు" అన్నాడు రాజు.

"జేబులో లేదు నిజమే కాని అతని గదిలో దిండు కిందో, బల్లసొరుగులోనో, పెట్టెలోనో వుందేమో?" అన్నాడు నారాయణ్ నవ్వుతూ.

"వెతికారా?" అడిగాడు స్వరాజ్యరావు

"లేదు! వెతికి వస్తాము" అంటూ నారాయణ్ వెళ్ళిపోయాడు.

యుగంధర్ శవం మొహం కాసేపు పరీక్షగా చూసి, తల వెనక చేతులు పెట్టి తడిమి చూశాడు. కళ్ళు చిట్లించి శవం తల వెనక, చెవుల వెనక, మాడుమీద వేళ్ళతో జాగ్రత్తగా తడిమి చూసి "మైడియర్ స్వరాజ్యరావూ మీ పోలీస్ సర్జన్ శవాన్ని పరీక్ష చేయలేదా?" అడిగాడు.

"లేదు ఇంకా రాలేదు. ఆత్మహత్య అని చెప్పడం వల్ల తొందర లేదనుకునుండాలి. ఏం?"

"శవం ఎడం వయిపు చెంప చెక్కుకుపోయింది. చెవి చితికిపోయింది. ఎడం వయిపు తల ఎముక విరిగింది. కుడివేపు ఓ చిన్న దెబ్బ కూడా తగలలేదు.కనుక ఎడం వైపు పడడం వల్ల ఎడం వయిపే దెబ్బలు తగిలాయి అనుకోవచ్చు. అవునా!"

స్వరాజ్యరావు తల ఊపాడు.

"తల వెనక కుడివయిపున యీ బొప్పి ఎలా కట్టింది?" అడిగాడు యుగంధర్.

స్వరాజ్యరావు వెంటనే వెళ్ళి తడిమి చూసి "యస్ యుగంధర్! యు ఆర్ కరెక్ట్" అన్నాడు.

అంతలో యిన్‌స్పెక్టర్ నారాయణ్ వచ్చి "లేదు ఫిరోజ్ గదిలో ఎక్కడా బాల్‌పాయింట్ పెన్సిల్ లేదు" అన్నాడు.

"ఉండదని నాకు తెలుసు. ఫిరోజ్ ఆత్మహత్య చేసుకోలేదు. హత్య చెయ్యబడ్డాడు. ఎవరో యితన్ని తలమీద కొట్టారు. స్పృహ తప్పి కిందపడిపోయి వుంటాడు. తరవాత ఆ హంతకుడు జేబులోంచి బాల్‌పాయింట్ పెన్సిల్ తీసి, ఫిరోజ్ రాసినట్లు ఆ ఉత్తరం రాసి, యితని శవం కిటికీలోంచి కిందికి పారేశాడు అని నా అనుమానం. తన జేబులో వున్న బాల్‌పాయింట్ పెన్సిల్ కాక ఫిరోజ్ జేబులో వున్న ఫౌంటెన్ పెన్‌తో ఆ హంతకుడు ఉత్తరం రాసి వుంటే ఫిరోజ్ హత్య చెయ్యబడ్డాడని అనుకోడానికి ఆస్కారం వుండేది కాదు. హంతకుడు పొరపాటు చేశాడు. ఆ పొరపాటు చేసి వుండకపోతే పట్టుబడే అవకాశ్మ వుండేది కాదు. అదీకక ఫిరోజ్ ఎడమవయిపు పడడం, ఎడం వయిపు మాత్రమే దెబ్బలు తగలడం హంతకుడి దురదృష్టం."

"వాటే కాంప్లికేషన్ సార్. సింపుల్ ఆత్మహత్య అనుకున్నాను" అన్నాడు యిన్‌స్పెక్టర్ నారాయణ్.

స్వరాజ్యరావు నవ్వి "ఎప్పుడయితే యుగంధర్ ఫిరోజ్ కోసం టెలిఫోన్ చేశాడో అప్పుడే తెలుసు నాకు యిది సింపుల్ కేసు కాదని. ఈ కేసులో మీ యింట్రస్టు ఏమిటో చెపుతారా" అనడిగాడు యుగంధర్‌ని.

"స్పెషల్ బ్రాంచి డైరెక్టర్ బండార్కర్ నన్ను దర్యాప్తు చెయ్యమన్నారు. వాళ్ళ ఏజెంటు నన్ను కలుసుకుని వివరాలు చెపుతాడని చెప్పారు. కాని ఆ ఏజంటు రాలేదు సరికదా యింకెవడో వచ్చి నన్ను చంపడానికి ప్రయత్నించాడు."

"గుడ్ గాడ్ వాణ్ణి పట్టుకున్నారా?" అడిగాడు స్వరాజ్యరావు.

"లేదు. పారిపోయాడు."

"మీకు చిక్కకుండా పారిపోయాడటే చాలా ఘటికుడయి వుండాలి."

యుగంధర్ నవ్వి "ఫిరోజ్ హత్య చెయ్యబడ్డాడు. అందులో సందేహం లేదు. నన్ను హత్య చెయ్యడానికి చేసిన ప్రయత్నానికీ, ఫిరోజ్ హత్యకీ ఏమైనా సంబంధం వుందా లేదా అనేది ప్రశ్న" అన్నాడు.

"ఎందుకు సంబంధం వుండాలి" అడిగాడు స్వరాజ్యరావు.

"ఫిరోజ్ నాకు టెలిఫోన్ చేసి అరగంటలో వస్తానని చెప్పాడు. నన్ను కలుసుకోకముందే హత్య చెయ్యబడ్డాడు. ఏదో విషయ ఫిరోజ్ నాకు చెప్పకుండా వుండేందుకే అతను హత్య చెయ్యబడ్డాడా? నేను ఆ విషయం గురించి దర్యాప్తు చెయ్యకుండా, ఇంకెవరికీ చెప్పకుండా వుండేందుకే నన్ను హత్య చేయడానికి ప్రయత్నించాడా?" అన్నాడు యుగంధర్.

"సారీ యుగంధర్ మీ వాదనలో లోపం వుంది. ఏదో విషయం మీకు చెప్పకుండా వుండేందుకు ఫిరోజ్ హత్య చెయ్యబడి వుంటే అంతవరకు అతను మీకా విషయం చెప్పలేదనీ, మిమ్మల్ని కలుసుకుని ఆ విషయం చెబుతాడని భయపడి ఫిరోజ్‌ని హత్య చేసి వుండాలి. మిమ్మల్ని కలుసుకుని, మీకా విషయం చెప్పకముందే ఫిరోజ్‌ని హత్య చేసినపుడు మిమ్మల్ని హత్య చేయడానికి ప్రయత్నించడం అనవసరం కదూ! మీకా విషయం ఏమిటో తెలియదుగా?" అన్నాడు స్వరాజ్యరావు.

"యస్. యు ఆర్ కరెక్టు. ఫిరోజ్ నాకు టెలిఫోన్‌లో ఏం చెప్పాడో హంతకుడికి తెలియదనే అనుకోవాలి. ఫిరోజ్ నన్ను కలుసుకుంటాడని అతనికి తెలుసు. అందుకే నన్ను కలుసుకోకముందే హత్య చేశాడు. ఆ విషయం ఏమిటో సూచనగా నాకు టెలిఫోన్‌లో చెప్పాడేమోననే భయంతో నన్ను హత్య చెయ్యడానికీ ప్రయత్నించాడని అనుకోవాలి" అన్నాడు యుగంధర్.

"అసలీ ఫిరోజ్ యెవరు? ఎక్కణ్ణించి వచ్చాడు? ఏమిటి యితని ఉద్యోగం? ఇవన్నీ కనుక్కోవాలి" అన్నాడు ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు.

"ఇది హత్య కేసు అయితే మీరు ఈ కేసు ఛార్జి తీసుకోవడం మంచిదేమో" అన్నాడు స్థానిక ఇన్‌స్పెక్టర్ నారాయణ్. స్వరాజ్యరావు తలూపి "కమీషనర్‌కి ఫోన్ చేసి రిపోర్టు యివ్వండి. నేనిక్కడే వున్నానని చెప్పండి. కమీషనర్ నన్ను ఛార్జి తీసుకోమంటే తీసుకుంటాను" అన్నాడు.

నారాయణ్ టెలిఫోన్ చెయ్యడానికి వెళ్ళిపోయాడు.

"మనం హోటలు మేనేజరుతో మాట్లాడుదాం" అన్నాడు యుగంధర్.

"అదిగో అక్కడ వున్నాడు మేనేజర్. పిలుస్తాను" అని స్వరాజ్యరావు వెళ్ళి మేనేజర్ని పిలుచుకొచ్చాడు.

"ఇదివరకెన్నడూ మా హోటల్లో ఇటువంటి ఘోరం జరగలేదు. ఆత్మహత్య చేసుకోదలిస్తే యీ మనిషికి మా హోటలే కనిపించిందా? ఏ బావిలోనో దూకి వుంటే మనందరికీ యీ కష్టం, మా హోటల్‌కి అపఖ్యాతి వచ్చేదికాదు" అన్నాడు మేనేజర్.

"ఈ ఫిరోజ్ గురించి మీకేం తెలుసు?" అడిగాడు యిన్‌స్పెక్టర్.

"నాకా! నాకేం తెలుసు? ఏం తెలియదు."

"ఏ వూరి నుంచి వచ్చాడు ఎప్పుడు వచ్చాడు?"

"ఓ అద్! హోటల్ రిజిస్టర్ చూస్తే తెలుస్తుంది."

"అయితే రిజిష్టరు చూపించండి."

"ఇదుగో" అని రిసెప్షన్ బల్లమీద వున్న రిజిష్టర్ పుస్తకం తీసి చూపించాడు.

22వతేదీ, అంటే ఆ రోజు పొద్దున్న పదిగంటలకి ఢిల్లీనుంచి వచ్చినట్లు వ్రాశాడు.

"హోటలుకి వచ్చిన తరువాత అతను ఎక్కడికయినా వెళ్ళాడా?"

"లిఫ్ట్‌బాయ్‌నీ, రూం బాయ్‌నీ అడిగితే తెలుస్తుంది" అని మేనేజర్ వాళ్ళని పిలిపించాడు.

ఫిరోజ్ బయటికి వెళ్ళినట్లు లేదని చెప్పారు వాళ్ళు.

"అతని గదిలో టెలిఫోన్ వున్నదా?" అడిగాడు యుగంధర్.

"యస్. మా హోటల్లో ప్రతి గదిలో టెలిఫోను వున్నది."

"మెయిన్ టెలిఫోనుకి ఎక్స్‌టెన్షన్ కదూ."

"అవును."

"గదిలో వున్నవాళ్ళు ఫోన్ చెయ్యాలంటే స్విచ్ బోర్డు ఆపరేటర్ని ఫలానా నెంబరు కావాలని అడగవలసిందేగా?"

"అవును."

"కనుక అతను ఏ ఏ నెంబర్లకి ఫోన్ చేసి వుంటాడో మీ రికార్డులో వుంటుందా?"

"ఆ! పుస్తకంలో రాస్తాము. ఆ పుస్తకం తెప్పిస్తానుండండి" అని టెలిఫోన్ ఆపరేటర్‌ని పిలిచి పుస్తకం తీసుకు రమ్మని చెప్పాడు మేనేజర్.

ఆపరేటర్ పుస్తకం తెచ్చి ఇచ్చింది.

"యస్ సర్ ఇదుగో రూం నెం.74 టెలిఫోన్ కాల్స్ లిస్టు. మొదటి కాల్ 714387 పార్టీ నాట్ ఎవైలబుల్. గంట తరువాత అదే నెంబరుకి ఫోన్ చేసాడు. కనెక్షన్ దొరికింది. రాత్రి ఏడున్నరకి యింకో కాల్ చేసాడు. అది యుగంధర్‌గారికి."

"ఇన్‌స్పెక్టర్! ఫిరోజ్ మొదట చేసిన కాల్ ఎవరికో కనుక్కోండి" చెప్పాడు యుగంధర్.

స్వరాజ్యరావు టెలిఫోన్ హవుస్‌కి ఫోన్ చేసాడు.

"డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు. నె. 714387 ఎవరి టెలిఫోన్ నెంబరు? ఆ గుడ్! అలాగా ఆల్‌రైట్" రిసీవరు పెట్టేసి "డైరక్టరీలో లిస్టు చేయని నెంబర్ అది. నేను వెళ్ళి నా ఆనవాలు తెలిపితే తప్ప ఆ నెంబరు ఎవరిదో చెప్పరట" అన్నాడు.

"అయితే ఆ విషయం మీరే తెలుసుకోవాలి. ఇక్కడ నాకింకేమీ పనిలేదు. ఈ విషయం తెలుసుకుని నాకు టెలిఫోన్ చెయ్యండి" అన్నాడు యుగంధర్.

యుగంధర్ క్రిజ్లర్ కారు యెక్కగానే "ఇంటికేనా?" అడిగాడు రాజు.

"అవును. బండార్కర్‌కి ఫోను చేసి చెప్పాలి. అసలీ ఫిరోజ్ యెవరో, అతని విషయం స్పెషల్ బ్రాంచికి ఏం తెలుసో కనుక్కోవాలి."

"ఫిరోజ్ ఆత్మహత్య చేసుకోలేదనీ, హత్య చెయ్యబడ్డాడనీ నిశ్చయమేనా?"

"ఆ"

రాజు గేటు తెరిచాడు. యుగంధర్ కారుని షెడ్లో పెట్టి తలుపు మూసి, తాళం వేసి వచ్చాడు. "ఏమీటి చూస్తున్నావు చీకట్లో?" అడిగాడు రాజుని.

"మీ జేబులో టార్చ్ వుందా?"

"ఆ" అని యుగంధర్ టార్చి వెలిగించి, వెలుగు రాజువైపు వేశాడు. గేటు ప్రక్కన గోడనానుకుని క్రోటన్స్ వున్నాయి. ఆ క్రోటన్ల మధ్యనించి రెండు బూటు కాళ్ళు కనిపిస్తున్నాయి. రాజు క్రోటన్స్ దగ్గరికి వెళ్ళి కొమ్మలు పక్కకి తోసి చూసి "శవం" అన్నాడు.

యుగంధర్ రాజు పక్కకి వెళ్ళాడు. ఇద్దరూ కలిసి క్రోటన్సు మధ్యనించి శవాన్ని బయటికి లాగారు. శవం ముఖం మీద టార్చి వెలుగు వేశాడు.

వాళ్ళిద్దరికీ హత్య చెయ్యబడిన మనుషులనీ, శవాలనీ చూడటం మామూలే. కాని యీ శవాన్ని చూడగానే కడుపులో చేయి పెట్టి కెలికినట్లయింది. కళ్ళు తిరిగాయి. శవానికి మొహమంటూ లేదు. రక్తంతో తడిసిన ఎర్రని బంతిలావుంది తల. కళ్ళు, చెవులు, ముక్కూ, నోరు ఏవీ కనిపించడంలేదు.

"గుడ్ గాడ్! హారిబుల్" అన్నాడు రాజు.

"నేనిక్కడే నిలుచుంటాను. నువ్వు వెళ్ళి స్వరాజ్యరావుకి ఫోన్ చెయ్యి" చెప్పాడు యుగంధర్.

"శవాన్ని యెవరు ఎత్తుకుపోతారు? మీరూ రండి" అన్నాడు రాజు.

"నువ్వు వెళ్ళి ఫోను చెయ్యి. నేను ఇక్కడే వుంటాను."

"ప్లీజ్! మీరూ రండి."

"రాజూ! ఏమిటిది? కొత్తగా వుంది నీ ధోరణి. నాకేదయినా ఆపద కలుగుతుందని నన్ను లోపలికి రమ్మంటున్నావా లేక ఒంటిగా యింట్లోకి వెళ్ళడానికి భయపడుతున్నావా? ఈ రెండింటిలో ఏది కారణమయినా యీ వృత్తిలో నువ్వు నాకు అసిస్టెంటుగా వుండడానికి తగవు" అన్నాడు యుగంధర్ విసుగ్గా.

రాజు మాట్లాడకుండా ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

యుగంధర్ చీకటిలో చుట్టూ చూసాడు. ఏమీ కనిపించడంలేదు. హంతకుడో హంతకులో ఇంకా తన ఇంటి ఆవరణలో ఎందుకు వుంటారు? యెన్ని గుండెలతో వుంటారు? నెమ్మదిగా గేటు దగ్గరకి వెళ్ళి, గోడకానుకుని నిలబడి సిగరెట్ వెలిగించాడు. సిగరెట్ వున్న చెయ్యి జాపి వుంచాడు. తన ఇంటి ఆవరణలో ఏ చెట్టు వెనకో ఏవరయినా దాక్కుని వుండి తనని కాల్చడానికి పూనుకుంటే యీపాటికి పిస్తోలు పేల్చేవారు. ఎవరూ లేరు. సిగరెట్ పొగ గట్టిగా పీల్చాడు.

తనూ, రాజూ చాలా జాగ్రత్తగా వుండాలి. వీడెవడో అన్నిటికీ తెగించిన వాడిలా వున్నాడు. ముందు ఫిరోజ్‌ని హత్య చేసాడు. తరువాత తన ఇంటికి వచ్చి తనని హత్య చేయడానికి  ప్రయత్నించాడు. ఇప్పుడు తన ఇంటి ఆవరణలో ఈ శవం.

"ఎవరిది?"

"విద్యాలంకార్ భార్గవ్ ప్రసాదు టెలిఫోన్ నెంబర్ అది."

"నేషనల్ డెయిలీ న్యూస్ ఇంగ్లీష్ దినపత్రిక ప్రొప్రయిటర్, ఎడిటరు కదూ!"

"అవును."

"భార్గవప్రసాద్‌ని కలుసుకున్నారా?"

"లేదు. వెళదామనుకుంటుండగా రాజు టెలిఫోన్ చేశాడు."

అంతలో రాజు తిరిగి వచ్చాడు.

"ఎవరు ఫోన్ చేశారు?" అడిగాడు యుగంధర్.

"పేరు చెప్పలేదు."

"పోనీ ఎందుకు ఫోన్ చేసిందీ చెప్పాడా?"

"ఫిరోజ్ విషయంలో మిమ్మల్ని జోక్యం కల్పించుకోవద్దని హెచ్చరించాడు."

"ఇంకా ఏమన్నాడు?"

"మిమ్మల్ని కనిపెడుతూనే వుంటాననీ, మీరు తన హెచ్చరిక పాటించకపోతే తనకు తెలుస్తుందనీ చెప్పాడు.

"తరవాత?"

"టెలిఫోన్ డిస్‌కనెక్టు చేశాడు."

"టెలిఫోన్ దగ్గరికి నన్ను పిలవమనలేదా?"

"లేదు. నేను మీ అసిస్టెంటునని చెప్పగానే ఆ హెచ్చరిక చేశాడు. అంతే."

"ఎక్కడ్నించి మాట్లాడుతున్నదీ తెలుసుకునే అవకాశం ఇవ్వలేదన్నమాట." అన్నాడు యుగంధర్.

అంబులెన్స్ వచ్చింది. శవాన్ని మార్చురీకి పంపే ప్రయత్నంలో వున్నాడు స్వరాజ్యరావు.

యుగంధర్ ఇంట్లోకి వెళ్ళి టెలిఫోన్ హౌస్ మేనేజర్‌కి ఫోన్ చేశాడు. "డిటెక్టివ్ యుగంధర్ హియర్. దయచేసి కొన్ని రోజులపాటు నా నెంబర్‌కి వచ్చే టెలిఫోన్ కాల్స్ ఎక్కడ్నించి వస్తాయో గమనించాలి. రాత మూలకంగా రేపు తెలుపుతాను. యస్! థాంక్స్" అని రిసీవరు పెట్టేసి ఢిల్లీకి బండార్కర్‌కి ట్రంకాల్ బుక్ చేసాడు.

"మీ ఏజెంటు నన్ను కలుసుకుని ఫిరోజ్‌ని గురించిన వివరాలు చెపుతాడని చెప్పారు మీరు. ఆ ఏజంట్ హత్య చేయబడ్డాడని నా అనుమానం" బండార్కర్‌కి చెప్పాడు కనెక్షన్ రాగానే.

"వాట్! ఎందుకా అనుమానం కలిగింది మీకు?" అడిగాడు బండార్కర్.

తన యింటి తోటలో కనిపించిన శవం గురించి చెప్పాడు యుగంధర్.

"దయచేసి అతని ఆనవాళ్ళు చెపుతారా?"

"సారీ మొహం రూపురేఖలు లేకుండా పోయింది. వేలిముద్రలు పంపిస్తాను. వాటిద్వారా ఆనవాలు తెలుసుకోవలసిందే."

"అలాగా! అయితే నేను వస్తాను మద్రాసుకి. విమానం దొరకగానే బయలు దేరుతాను. మద్రాసు ఏర్‌పోర్టులో దిగగానే మీకు ఫోన్ చేస్తాను. వేలిముద్రల ఫొటోలు యిక్కడికి పంపనవసరంలేదు. మా ఏజంట్ వేలి ముద్రలు, ఫోటో నేను తీసుకువస్తాను" చెప్పాడు బండార్కర్.

"ఆల్‌రైట్! యిన్‌స్పెక్టర్‌కి చెపుతాను" అని యుగంధర్ రిసీవర్ పెట్టేశాడు.

(కొనసాగింపు వచ్చేనెలలో)

Post your comments